

పట్టుబడిన నగదుతో ఏటీవో రవీందర్, ఈఈ హుస్సేన్ (పసుపు రంగు చొక్కా)

లంచం అడిగారు.. అనిశాకు చిక్కారు!

జనగామ, న్యూస్‌టుడే: ఇద్దరు ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన సంఘటన జనగామ కలెక్టరేట్‌లోని ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం బండ్లగూడెంకు చెందిన మాజీ సైనికుడు చిర్ర సత్యపాల్ రెడ్డి ఇదే మండలంలోని నెల్లుట్ల- లింగాలఘనపురం రహదారి పక్కన పెట్రోలు బంకును ఏర్పాటు చేసేందుకు తన భార్య పేరిట దరఖాస్తు చేసుకున్నారు. నిర్దేశిత రుసుము చెల్లించారు. ఆయనకు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఆర్అండ్‌బీ ఈఈ హుస్సేన్ రూ.14 వేలు డిమాండ్ చేశారు. దీంతో సత్యపాల్‌రెడ్డి వరంగల్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయంలో ఈఈ చిలుకపాటి హుస్సేన్‌కు రూ.12 వేలు, ఏటీవో రవీందర్‌కు రూ.2 వేలు ఇస్తుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని శనివారం ఉదయం కోర్టులో హాజరుపర్చనున్నట్లు సాంబయ్య తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు డబ్బులు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబరు 1064కు ఫోన్ చేయాలని కోరారు.

జనగామ జిల్లాలో వరుసగా వెలుగు చూస్తున్న అవినీతి ఘటనలపై ప్రత్యేక కథనం
'పట్టుబడుతున్నా.. పట్టింపు లేదా?' 6లో..





ఆకేరు పొడవునా..
ఇసుకాసురులదే ఇష్టారాజ్యం!

ఉమ్మడి వరంగల్‌లో సాగు, తాగునీటికి కీలకమైన ఆకేరు వాగు.. ఇసుక అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. కాసులు కురిపిస్తుండడంతో నిబంధనలను ఇసుకలో తొక్కేస్తున్నారు. మూడు జేసీబీ యంత్రాలు.. ఆరు ట్రాక్టర్లు అన్నచందంగా అడ్డదారుల్లో రేయింబవళ్లు తవ్వి రవాణా చేస్తున్నారు. కొన్ని చోట్ల రాజకీయ నాయకుల మద్దతు.. మరికొన్ని చోట్ల పోలీసులు 'మామూలు'గా తీసుకుంటుండడంతో వారిని ఏం చేయలేని పరిస్థితి.. నిత్యం వందలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడుతుండడంతో నీటి నిల్వల కోసం రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంలు సైతం వరదలకు కొట్టుకుపోతున్నాయి. జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల గుండా ప్రవహించే ఈ వాగులో ఇసుక అక్రమ రవాణా ఎక్కడెక్కడ జరుగుతుందో పరిశీలించి 'ఈనాడు' ప్రత్యేక కథనం.

రోజువారీ ఇసుక అక్రమ రవాణా ఇలా

ట్రాక్టర్లు	350
ఒక ట్రాక్టర్‌లో రవాణా (క్యూబిక్ మీటర్లు):	3
మొత్తం తరలిస్తోంది (క్యూబిక్‌మీటర్లు):	1050
ఒక ట్రాక్టర్ ఇసుక ధర: రూ.	6000
అక్రమార్కులు పొందుతున్న ఆదాయం(రూ.లక్షలు)	21

120.6 కి.మీ. ప్రవాహం

జనగామ జిల్లా చిల్పూరు మండలం పైపాటు నుంచి ప్రారంభమయ్యే చిన్న ప్రవాహం నష్కల్ వద్ద ఆకేరు వాగుగా మారుతుంది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఇది ఉమ్మడి వరంగల్ పరిధి 4 జిల్లాల్లోని 13 మండలాల్లో 46 గ్రామాల మీదుగా 120.6 కి.మీ. ప్రవహిస్తోంది. పరివాహకంలోని దాదాపు 35 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తోంది. సమీపంలోని బావులు, బోర్లలో భూగర్భజలాలు వృద్ధి చెందడానికి దోహదపడుతోంది.

- జఫర్‌గఢ్ మండలంలోని తిడుగు గ్రామ సమీపంలో వరద పెరగక ముందు 25 నుంచి 30 ట్రాక్టర్ల ఇసుకను తరలించేది. ఇప్పుడు వరద ప్రవాహం ఉన్నా 15 ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు.
- ఐనవోలు మండలం నందనం, రాంనగర్ ప్రాంతాల్లో తవ్వకాలకు నెల రోజులుగా చెక్ పడింది. గతంలో ఇక్కడ పనిచేసిన పోలీసు అధికారుల అండదండలతోనే రవాణా జరిగేదనే ఆరోపణలున్న నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్సై వాగులోకి ఎవరూ వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. సుమారు 100 ట్రాక్టర్లు ఇళ్లకే పరిమితమయ్యాయి. కొందరు అక్రమార్కులు రాత్రిపూట తరలిస్తున్నట్లు సమాచారం. మరికొందరు ఎలాగైనా అధికారులను మచ్చిక చేసుకుని ఇసుక రవాణా చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.
- వర్ధన్నపేట మండలం ఇల్లంద, వర్ధన్నపేట, కొత్తపల్లి, ల్యాబర్తి ప్రాంతంలోని వాగు నుంచి ప్రతి రోజు 250 ట్రాక్టర్ల ఇసుక నగరానికి తరలుతోంది. తెల్లవారుజామున 3 గంటలకు ఖమ్మం-వరంగల్ 563వ జాతీయ రహదారిపై దాదాపు 2 కి.మీ. పొడవునా ట్రాక్టర్ల వరుస కనిపిస్తుంది. తోడేందుకు జేసీబీ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఇసుకతో కూడిన మట్టిని సైతం వాహనంలో నింపి నీటితో మట్టిని వేరు చేస్తున్నారు.



ఇల్లంద సమీపంలో



కొత్తపల్లిలో మట్టిని వేరు చేశాక..



ల్యాబర్తిలో జేసీబీ యంత్రం ద్వారా..

వాగు నుంచి చెరువుకు

జఫర్‌గఢ్ మండలం కోనాచలం ప్రాంతంలోని వాగు నుంచి వర్ధన్నపేట పెద్ద చెరువులోకి వరదనీరు వెళ్లేలా కట్టు కాలువ నిర్మించారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి ప్రాంతంలోని మత్తడి వద్ద నిర్మించిన కట్టుకాలువ ద్వారా రాయపర్తి మండలం కొత్తూరులోని రెండు చెరువుల్లోకి, అక్కడి నుంచి పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ చెరువులోకి వరదనీరు వెళ్తోంది. నెల్లికుదురు మండలం ఎర్రబెల్లి గూడెం వద్ద వాగుపై ఉన్న మత్తడి వద్ద నిర్మించిన కట్టుకాలువ ద్వారా నెల్లికుదురు పెద్ద చెరువులోకి ఆకేరు వరద ప్రవహిస్తుంది. అక్కడా అక్రమ రవాణా సాగుతోంది.

- పర్వతగిరి మండలంలోని చెరువుముందుతండాలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారుల నిఘాతో తవ్వకాలు నిలిచాయి. త్వరలోనే తవ్వకాలు చేసేందుకు అక్రమార్కులు అధికారులు తమని పట్టించుకోకుండా చూడాలని పేరున్న ప్రజాప్రతినిధిని కలవాలని సన్నద్ధమవుతున్నారు.

తవ్వకాలను అడ్డుకోవాలని చెప్పాం..

రెవెన్యూశాఖలో కిందిస్థాయి సిబ్బంది లేకపోవడంతో అక్రమ తవ్వకాలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టలేకపోతున్నాం. తవ్వకాలను అడ్డుకోవాలని, పోలీసుల సహకారంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల తహసీల్దార్లకు చెప్పామని తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు పేర్కొన్నారు.



నెల్లికుదురులోని వాగులో నీటిలో దిగబడిన ట్రాక్టర్‌ను బయటికి లాగుతున్న మరో రెండు ట్రాక్టర్ ఇంజిన్లు



నర్సింహులపేట మండలం జయపురం, చిన్నగూడూరు మండలం చిన్నగూడూరు, మరిపెడ మండలం బీచ్‌రాజుపల్లి, ఉల్లేపల్లి ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తున్నారు. ఈ మూడు మండలాల్లోంచి 50 ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతోంది.



- నెల్లికుదురు మండలం నెల్లికుదురు, బ్రాహ్మణకొత్తపల్లి, మునిగలవీడు సమీపంలోని వాగుల్లోంచి ప్రతి రోజు 35 ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతోంది. వరదనీటిలోంచే ఇసుకను తవ్వి తరలిస్తున్నారు.

కేసులు ఇలా..

వరంగల్ కమిషనరేట్ పరిధిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 45 కేసులు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో 64 నమోదు చేసి 96 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో 98 వాహనాలను పట్టుకుని కేసులు పెట్టకుండా మైనింగ్‌శాఖ అప్పగించారు.



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద..

సన్నాల కొనుగోలుకు సన్నాహాలు..
నిర్ధారణకోసం నిర్వాహకులకు శిక్షణ!

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: వానకాలం పరిధాన్యం కొనుగోలులో నాణ్యత గల సరకును కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే జిల్లాల వారీ లక్ష్యాలను నిర్దేశించుకున్న జిల్లా యంత్రాంగం కొన్ని కొత్త మార్పులతో కొనుగోళ్లకు శ్రీకారం చుట్టనుంది.

☛ వానాకాలం నుంచి ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో వాటి నిర్ధారణకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు వ్యవసాయాధికారులతో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుతం 31 రకాల సన్నధాన్యాలున్నాయని.. వీటిలో నాణ్యమైనవి గుర్తించడం అంత సులువు కాదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండురోజుల శిక్షణ ఇవ్వనున్నారని సమాచారం.

☛ కేంద్రాలలో ధాన్యం బస్తాల తూకం కుదురుగా పేర్చడం, లారీలో పద్ధతిగా భర్తీచేసే హమాలీ కార్మికులకు ఇదివరకు ఇచ్చిన రూ.20కి మరో రూ.2 పెంచి ఇవ్వనున్నట్లు సమాచారం.

● పని	● రేటు (రూ.)
ధాన్యం దిగుమతి	4
తూకం వేయడం	2.80
బస్తాల్లో నింపడం	6.40
బస్తాల కుట్టుపని	3.40
లారీలో లోడింగ్	5.40

☛ జిల్లాలో గ్రామీణాభివృద్ధి, సహకార శాఖలు మొత్తం 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు ప్రాథమిక అంచనా. ధాన్యం తాకిడి పరిగణనలోకి తీసుకుని వీటి సంఖ్య పెంచే అవకాశం ఉంది. వచ్చే నెల మొదట్లో ప్రతి మండలంలోనూ కనీసం ఒకటి రెండు కేంద్రాలను ప్రారంభించాలనే ధ్యేయంతో ప్రభుత్వం ఉంది.

☛ గత కొనుగోళ్లను పరిగణనలోకి తీసుకుని 4 వేల క్వింటాళ్లకు పైన కొనుగోలు చేసే కేంద్రాలకు రెండేసి తూకం, తూర్పార పట్టే యంత్రాలు అందించనున్నారు.

☛ సెర్ప్, సహకార శాఖ సంయుక్తంగా ధాన్యం కొనగోలు కేంద్రాల ద్వారా కనీసం 13 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించాలని భావిస్తోంది. హమాలీ ఖర్చులను రైతే భరించాల్సి ఉంటుంది.



ఎక్కడెక్కడ ఎన్ని?

సెర్ప్ రఘునాథపల్లి 19, లింగాల గణపురం 9, బచ్చన్నపేట, చిల్పూరు, దేవరుప్పుల, నర్మెట్ట పాలకుర్తి 7 చొప్పున, స్టేషన్ ఘణపూర్ 6, తరిగొప్పుల 6, కొడకండ్ల 4, జనగామ, జఫర్‌గఢ్ మండలంలో 3 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయించింది.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డీసీపీ రాజమహేంద్రనాయక్, సంబంధితశాఖల అధికారులతో కలిసి రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. పోలీసు, జాతీయ రహదారి, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రవాణా, పోలీసు, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్తు, ఆర్టీసీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, చిత్రంలో డీసీపీ రాజమహేంద్రనాయక్

గోడపత్రికల ఆవిష్కరణ

జనగామ అర్బన్ : ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం అన్ని మండల కేంద్రాల్లో రేబిస్ నివారణ శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా ఆదేశించారు. దీనికి సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం కలెక్టర్ ఆవిష్కరించారు. అన్ని మండల కేంద్రాల్లో పశువైద్యాధికారులు ఉచితంగా రేబిస్ టీకాలు వేయాలని సూచించారు. కళాశాలలు, పాఠశాలల్లో రేబిస్ నివారణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్య, సంవర్ధకశాఖ అధికారి వై. రాధాకిషన్, నర్సయ్య, ఏడీ దేవేందర్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో సంపూర్ణ వికాసం

జనగామ, న్యూస్‌టుడే: క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో మానసికోల్లాసంతో పాటు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సిద్ధిస్తుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన యువజనోత్సవాల పోటీలను కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జిల్లాస్థాయి ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లాలోని వివిధ విద్యాలయాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా యువజన క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ జక్కుల అనిత పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొండా లక్ష్మణ్ జీవితం భావితరాలకు స్ఫూర్తి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాటం, నిజాం వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ వంటి ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ రిజ్వాన్‌బాషా అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, వివిధ శాఖల అధికారులు, బీసీ కుల సంఘాల నాయకులు కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమాధికారి బి.రవీందర్ అధ్యక్షతన జరిగిన జయంతి ఉత్సవ సభను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ చేనేత ఉత్పత్తుల క్రయ విక్రయాల కోసం మొదట సహకార సంఘాలను బాపూజీ ఏర్పాటు చేశారని కొనియాడారు. ఉద్యమాలతో పాటు ప్రజాసేవకు తపించారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వేముల బాలరాజు, దొర్నాల వెంకటేశ్వర్లు, చింతకింది కృష్ణమూర్తి, దామోదర్, రాజ్‌కుమార్, పిట్టల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు..7 లో



జనగామలో కొండా లక్ష్మణ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీబీసీడీవో రవీందర్

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

జనగామ టౌన్: జనగామలోని జిల్లా ప్రధాన న్యాయస్థానంలో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సి.విక్రమ్ ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

మండలాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్, వేలేరు మండలాల అభివృద్ధికి అధికారులు తోడ్పాటు అందించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పాలనాధికారి ప్రావిణ్యతో కలిసి ఆయా మండలాల అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఆ రెండు మండలాల్లో ప్రభుత్వ భూములు సర్వే చేయాలని, అక్రమ మైనింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వేలేరు మండలంలో తహసీల్దార్, మండల పరిషత్తు కార్యాలయాల ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి నివేదిక అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, డీఎంహెచ్‌వో లలితాదేవి, డీఈవో వాసంతి, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి, చిత్రంలో కలెక్టర్ ప్రావిణ్య

జిల్లా వైద్యాధికారి బాధ్యతల స్వీకరణ

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వైద్యాధికారిగా డాక్టర్ రవీందర్‌గౌడ్ శుక్రవారం పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ డీఎంహెచ్‌వోగా పని చేసిన హరీశ్‌రాజ్ రెండు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. దీంతో కలెక్టర్ రిజ్వాన్ బాషా రవీందర్‌గౌడ్‌కు డీఎంహెచ్‌వోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



రవీందర్‌గౌడ్

'కడియంను కాంగ్రెస్ శ్రేణులే ఓడిస్తాయి..'

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: నియోజకవర్గానికి ఉప ఎన్నికలు వస్తే ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఓడించేందుకు ఆయన చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులే సిద్ధంగా ఉన్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని భారాస కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాసలోనే ఉంటూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకున్న ద్రోహి కడియం శ్రీహరి అని మండిపడ్డారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు వంద పడకల ఆసుపత్రికి జీవో వచ్చాక.. మున్సిపాలిటీకి మార్గం సుగుమం అయ్యాక ఒకే పార్టీలో ఉండి వాటిని అడ్డుకున్నది శ్రీహరి అని ఆరోపించారు. గెలిచి తొమ్మిది నెలలు గడుస్తున్నా రూపాయి పని చేయకుండా అభివృద్ధి గురించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఉప ఎన్నికలు వస్తున్నాయనే భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. పార్టీ ఫిరాయింపుల కేసులో స్పీకర్ గడ్డం ప్రసాద్ రాజ్యాంగానికి కట్టుబడి వ్యవహరించాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో తాను చేసిన అభివృద్ధి ఏందో రాజీనామా చేసి వస్తే చూపిస్తానని రాజయ్య సవాల్ విసిరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు మారపాక రవి, చాడ సరిత, పార్టీ మండలాధ్యక్షుడు గణేష్, నాయకులు మనోజ్ రెడ్డి, సురేష్‌కుమార్, గణేష్, కుమార్, ప్రసాద్, అశోక్, వినయ్, మల్లేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్య





ఆకాశానికి పచ్చని పందిరి

ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు కలిసిపోయి, ఆకాశానికి పందిరి వేసినట్లు ఈ రోడ్డు ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ఈ రహదారి గుండా వెళ్తుంటే అడవిలో నుంచి వెళ్తున్నట్లు అనుభూతి కలుగుతోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రం నుంచి కొత్తకొండకు వెళ్లే ప్రధాన రహదారిలో ఆరు కిలోమీటర్ల మేర ఎటు చూసినా పచ్చదనం నిండి కనువిందు చేస్తోంది.

– ఈనాడు, హనుమకొండ

ఓరుగల్లుకు 'ఘన' స్వాగతం!



ఓరుగల్లు.. ఎటుచూసినా.. చారిత్రక ఆలయాలు, గొలుసు కట్టు చెరువులు కనిపిస్తాయి. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, వేయిస్తంభాల ఆలయంతో పాటు ఇతర ప్రాంతాలను సందర్శించేందుకు నిత్యం వేల మంది పర్యాటకులు వస్తుంటారు. అతిథులను ఆహ్వానించేందుకు వరంగల్ జిల్లాకు నాలుగు దిక్కులా స్వాగత తోరణాలు నిర్మించనున్నారు. అందులో ఒకటి వరంగల్ బొల్లికుంటలో, రెండోది హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిలో రాంపూర్ వద్ద, మూడోది ఎల్కతుర్తి, నాలుగోది నర్సంపేట వద్ద.. ఇలా నలువైపులా స్మార్ట్ సిటీ నిధులతో ప్రత్యేక స్వాగత తోరణాలు నిర్మించేందుకు అధికారులు పనులు మొదలుపెట్టారు. నిర్మాణాలు పూర్తయితే నగరానికి ప్రత్యేక ఆకర్షణ రానుంది. రోడ్డుకు ఇరువైపులా 8 భారీ స్తంభాలు ఏర్పాటు చేసి వాటిపై కాకతీయుల చరిత్ర, శిల్ప సౌందర్యం ఉట్టిపడేలా నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వరంగల్ జిల్లా బొల్లికుంట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన స్వాగత తోరణానికి సంబంధించిన భారీ స్తంభాలను చిత్రంలో చూడొచ్చు. – ఈనాడు, హనుమకొండ



బంతి పూలవనం.. బతుకమ్మ వేడుకలకు సిద్ధం!

బతుకమ్మ పండగ సమీపిస్తున్న వేళ.. ఓ రైతు వేసిన బంతిపూల తోట ఎరుపు, పసుపు రంగుల పువ్వులతో విరబూసింది. మహబూబాబాద్ మండలంలోని మాధవపురం-కురవి రహదారి వెంట వాహనదారులను ఈ తోట ఆకట్టుకుంటోంది.

– న్యూస్‌టుడే, మహబూబాబాద్, నెహ్రూసెంటర్

ఉలిక్కిపడిన అడవి..!

● సిబ్బందిపై దాడులతో ఆందోళన

వారు.. రేయింబవళ్లు అటవీ సంరక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తారు. వారిపైనే దాడి జరగడం అటవీ రక్షణ ఎంత ప్రమాదకరంగా మారిందో చెబుతోంది. ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధి దామెరవాయిలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు అటవీ అధికారులపై కొందరు ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా సరైన పరిష్కారం దొరకడం లేదు.

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి



గాయాలపాలైన అటవీ సిబ్బంది

విధులు.. కత్తిమీద సాము..

ఓ వైపు కలప స్మగ్లర్లు, వన్యప్రాణుల వేటగాళ్లు, పోడుదారులు, అటవీ జంతువులతో ప్రమాదాలు పొంచి ఉన్నప్పటికీ విధులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రయత్నంలో కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. రెండేళ్ల కిందట భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు భూముల వ్యవహారంలో గొత్తికోయల చేతిలో శ్రీనివాసరావు అనే రేంజ్ అధికారి ప్రాణాలు పోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది.

పోడు పేరుతో..

పోడు పేరుతో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో పలువురు అడవులను నరికి వేస్తున్నారు. పోడు పట్టాల సర్వే సమయంలో మూడు జిల్లాల్లో 16 ఘటనలు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పోడును అడ్డుకుంటే దాడులకు పాల్పడుతున్నారు.

ఆయుధాలపై నిర్ణయమెప్పుడో?

అటవీ అధికారులు అడవుల్లో ఆయుధాలు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో స్మగ్లర్లు, పోడుదారులు, వేటగాళ్లతో ముప్పు పొంచి ఉంది. 1982కు ముందు అటవీ అధికారులకు తుపాకులు ఉండేవి. మావోయిస్టుల కదలికలతో తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. మళ్లీ ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ ఉన్నా.. అది నెరవేరడం లేదు.

గతంలో సంఘటనలు

- 2022 నవంబరు 9న ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపురం గ్రామంలో పోడు జరుగుతుందని తెలిసి వెళ్లిన సెక్షన్, బీట్ అధికారులపై పోడుదారులు దాడి చేయించారు.
- 2022 సెప్టెంబరులో జయశంకర్ జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామంలో పోడుభూముల్లో ట్రాక్టర్లతో దున్నుతుండగా.. అటవీ అధికారులు వెళ్లి ఆపేందుకు ప్రయత్నించగా దాడికి పాల్పడ్డారు. ఇద్దరు అధికారులు గాయపడ్డారు.
- 2021 అక్టోబరులో జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం పంబాపురం గ్రామంలో అటవీభూముల్లో సాగును అడ్డుకునే క్రమంలో అటవీ అధికారులపై పోడుదారులు కారంపొడి చల్లి, పెట్రోల్ పోశారు. మహిళా ఎఫ్‌ఆర్వోతో పాటు ఇద్దరు అధికారులు గాయపడ్డారు.

ఆయుధాలు ఇవ్వడంపై త్వరలో నిర్ణయం

మట్టెవాడ, న్యూస్‌టుడే: అటవీ శాఖ ఉద్యోగులకు ఆయుధాలు అందించే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అటవీ సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్ చంద్రలను శుక్రవారం పరామర్శించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. దాడులు చేసిన వారిపై పీడీ, హత్యాయత్నం, తదితర కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని ములుగు ఎస్పీని ఫోన్‌లో ఆదేశించారు.



బాధితులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సురేఖ

ప్రజలు భాగస్వాములు కావాలి: - ప్రభాకర్, సీసీఎఫ్, కాళేశ్వరం జోన్

అకారణంగా విధులు నిర్వర్తిస్తున్న అటవీ సిబ్బందిపై దాడులకు పాల్పడ్డారు. గాయాలపాలైన వారిని ఆసుపత్రిలో చేర్పించాం. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. అడవుల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి. అటవీ సంపదను కాపాడే సిబ్బందికి అండగా ఉండాలి.

పట్టుబడుతున్నా.. పట్టింపు లేదా?

● జనగామ కలెక్టరేట్‌కు అవినీతి మకిలి
● పది నెలల్లో రెండో అనిశా ఘటన

ఈనాడు, వరంగల్, జనగామ, న్యూస్‌టుడే

అది జిల్లా పాలనా కేంద్రం. కలెక్టర్‌తోపాటు అనేక శాఖల అధిపతులు విధుల్లో ఉంటారు. కొందరు అవినీతి అధికారుల ఆగడాలకు అక్కడ అడ్డు లేకుండా పోతోంది. ఎవరుంటే మాకేంటి? మేం ఏ పనికైనా లంచాలు వసూలు చేసి తీరుతాం అన్నట్టు వ్యవహరిస్తున్నారు. తమ శాఖ కార్యాలయాలనే అడ్డాగా మార్చారు. అదే జనగామ కలెక్టరేట్.

జనగామ జిల్లాలో గత మూడు మాసాల్లో నెలకొక అవినీతి అధికారి ఏసీబీకి పట్టుబడ్డారు. కొందరు ప్రజాపాలనకు వేదికగా, పౌర సేవా కేంద్రంగా ఉండాల్సిన జిల్లా సచివాలయానికీ అవినీతి మురికిని అంటిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులే లంచావతారమెత్తి సహోద్యోగులను అవినీతి కూపంలోకి దించుతున్నారు. జనగామ ఆర్అండ్‌బీ ఈఈ చిలుకపాటి హుసేన్‌తో పాటు, సహాయ సాంకేతిక అధికారి రవీందర్‌లు శుక్రవారం అనిశా అధికారులకు చిక్కడం కలకలం రేపింది.

సైనికుడినీ వదలలేదు: జిల్లాలోని లింగాలఘనపురం మండలం బండ్లగూడేనికి చెందిన చిర్ర సత్యపాల్‌రెడ్డి రెండు దశాబ్దాల పాటు సైన్యంలో దేశానికి సేవలు చేసి 20 ఏళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. పెట్రోలు బంకు స్థాపించేందుకు గతంలో చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఇటీవల తమ మండలంలో బంకు ఏర్పాటుకు అవకాశం వచ్చింది. దీనికి కావాల్సిన నిరభ్యంతర పత్రం కోసం ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయంలో నెలరోజుల కిందట అర్జీ ఇచ్చారు. రూ.17 వేల లంచం ఇవ్వాలని ఈఈ హుసేన్ డిమాండ్ చేసి, బేరం అనంతరం రూ.14వేలకు ఒప్పుకున్నారు. అధికారుల తీరు నచ్చక ఆయన వరంగల్ అనిశా అధికారులను సంప్రదించారు.

సంవత్సరం	ఏసీబీ కేసులు
2020	7
2021	7
2022	9
2023	11
2024	12

వారం కిందట తప్పించుకున్నారు..

వారం కిందటే అనిశా అధికారులు వ్యూహాన్ని అమలు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ రోజు ఈఈ లేకపోవడంతో వెనుదిరిగారు. శుక్రవారం టార్గెట్ మిస్ కాలేదు. రూ.14 వేలు ఈఈకి ఇవ్వగా, అందులో నుంచి రూ.2వేలు ఏటీవో రవీందర్‌కు ఇవ్వాలన్న సూచన ప్రకారం ఆయనకు అందజేశారు. శనివారం ఏసీబీ వరంగల్ ప్రత్యేక కోర్టులో వీరిని హాజరుపర్చనున్నారు.



ఆర్అండ్‌బి అధికారుల అవినీతి వ్యవహారం.. పట్టివేతపై వివరాలు చెబుతున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య



ఫిర్యాదుదారు చిర్ర సత్యపాల్‌రెడ్డి

మధ్యవర్తులతో వసూలు

● గత నవంబరు 20న జనగామ మున్సిపల్ కమిషనర్ రజిత రూ.40 వేలు లంచం డిమాండ్ చేసి, సదరు డబ్బును తన కారు డ్రైవర్‌కు ఇవ్వమన్నారు. పక్కా వ్యూహంతో ఏసీబీ అధికారులు ఇద్దరిని పట్టుకుని కేసు నమోదు చేశారు.

● గత జనవరిలో జిల్లా సచివాలయంలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి ప్రశాంత్, ఒప్పంద ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు రూ.లక్ష డిమాండ్ చేశారు. రూ.50 వేలు ఇచ్చినా సంతృప్తి చెందక, మరో రూ.50వేలకు ఒత్తిడి తేగా సదరు ఉద్యోగిని అనిశాను ఆశ్రయించింది. లంచం తీసుకుంటూ వైద్యాధికారితో పాటు, జూనియర్ అసిస్టెంట్ అజహర్‌లు పట్టుబడ్డారు.

ఎక్కడ వీలైతే అక్కడ

రఘునాథపల్లి మండలం కంచనపల్లి పంచాయతీ కార్యదర్శి తాజా మాజీ సర్పంచి చేసిన పనులకు బిల్లు చెల్లించేందుకు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. మండల పరిషత్ కార్యాలయంలో సదరు డబ్బు తీసుకుంటూ జులై నెలలో పట్టుబడ్డాడు. పాలకుర్తి మండల మాజీ ఎంపీటీసీ సభ్యుడు చేసిన పనికి బిల్లు చెల్లించేందుకు మండల ప్రత్యేక అధికారి హోదాలో రూ.10వేల లంచం తీసుకుంటూ ఆ మండల ఇరిగేషన్ అధికారి గోపాల్ అనిశాకు చిక్కారు. పనిచేసే చోట కాకుండా నివాసం ఉన్న హనుమకొండ(నక్కలగుట్ట)లోని ఓ చోట లంచం తీసుకుంటూ దొరికిపోయారు.

వారిద్దరిదీ ఒకే ఊరు

అవినీతి అంతం కావాలంటే ప్రజల్లో చైతన్యం పెరగాలి. తమ పనుల కోసం లంచం డిమాండ్ చేసే వారి ఆటకట్టించాలనే తపన అవసరమంటున్నారు సామాజిక వేత్తలు. ఈఈ హుసేన్ ఆటకట్టించిన సత్యపాల్‌రెడ్డి, జనగామ మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు చేసిన చెట్టిపల్లి రాజు ఇద్దరిదీ బండ్లగూడెం గ్రామమే.

ఆ ఇంటి యజమానికి నోటీసులు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన ఇంటిని తహసీల్దార్ సదానందం, దేవాదుల ఎత్తిపోతల పథకం డీఈఈ ప్రశాంతి, ఎంపీడీవో అనిల్‌కుమార్ తదితరులు పరిశీలించారు. 'చెరువులోనే భవనం' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఇల్లు కట్టిన సర్వే నెంబరుతో పాటు పరిసరాల రైతుల పట్టా భూములను సోమవారం పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని చెప్పారు. ధర్మసాగర్ పంచాయతీ కార్యదర్శి రమేష్, కారోబార్ మహేందర్‌రెడ్డిలు ఆ ఇంటి యజమానికి నోటీసు జారీ చేశారు. పంచాయతీ నుంచి గానీ, కుడా నుంచి గాని ఏవిధమైన అనుమతి లేకుండా ఇల్లు ఎలా నిర్మించారని, దీనికి 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ భవనం ఎఫ్‌టీఎల్‌లో ఉందా, బఫర్‌జోన్‌లో ఉందా నిర్ధారించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, సర్వేయర్ సురేందర్, దేవాదుల ఎత్తిపోతల పథకం ఏఈఈ అరవింద్, సిబ్బంది పాల్గొన్నారు.



భవనాన్ని పరిశీలించి, పట్టాదారుతో మాట్లాడుతున్న అధికారులు

డీఎస్సీ-2008 అభ్యర్థుల ఆందోళన

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008 అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)గా నియమించడానికి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 274 మంది ఉన్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. శుక్రవారం నుంచి అక్టోబర్ 5 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. 16 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అవకాశం కల్పించడంతో అర్హులైన అభ్యర్థులు హనుమకొండ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. అక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో కంగుతిన్నారు. ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకున్న అభ్యర్థులకు కనీసం సమాచారం అందించే వారేలేరని వాపోయారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు వేచి చూసిన వారంతా అక్కడే ఆందోళన చేశారు. ఎంతో ఆశతో వస్తే పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. సమాచారం తెలుసుకున్న విద్యాశాఖ అధిశాఖ సిబ్బంది అప్పటికప్పుడు ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. ఒప్పంద పద్ధతిలో ఉద్యోగాలు చేసేందుకు అంగీకారం తెలిపిన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.



హనుమకొండ డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

అహ్మదాబాద్ ఐఐఎంలో హనుమకొండ విద్యార్థి ఆత్మహత్య

ఈనాడు, వరంగల్ : అహ్మదాబాద్ ఐఐఎంలో హనుమకొండకు చెందిన విద్యార్థి భుక్య అక్షిత్ (24) గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన అక్కడ ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గుజరాత్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబరు 27 నుంచి ఐఐఎం క్యాంపస్‌లో రెడ్ బ్రిక్స్ సదస్సు (టీఆర్‌బీఎస్) ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వేడుకల్లో అక్షిత్ కీలక బాధ్యతలు నిర్వహించాల్సి ఉంది. 25 మంది విద్యార్థులు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తుండగా అక్షిత్ అందులో ఒకరు. ఈ సదస్సుకు గౌతమ్ ఆదానీతోపాటు ప్రముఖ వ్యాపార దిగ్గజాలు హాజరై ప్రసంగించాల్సి ఉంది. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురైన అక్షిత్ వసతిగృహంలోని తన గదిలో నైలాన్ తాడును ఉపయోగించి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనతో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరగాల్సిన రెడ్ బ్రిక్ సదస్సును ఐఐఎం రద్దు చేస్తున్నట్టు సంస్థ ప్రకటించింది. వస్త్రాపూర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. అక్షిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సోలా సివిల్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి శుక్రవారం ఉదయం అక్షిత్ తల్లిదండ్రులు అహ్మదాబాద్ చేరుకున్నారు. అక్షిత్ చదువుల్లో చాలా చురుకైన విద్యార్థి. భోపాల్‌లోని మౌలానా ఆజాద్ నేషన్ ఇన్‌స్టిట్యూట్ నుంచి బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి ఏడాదిపాటు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేశారు. 2023లో ఐఐఎంలో సీటు రావడంతో ఎంబీఏ కోర్సులో చేరారు. అక్షిత్ ఆత్మహత్యకు ఒత్తిడే కారణమా మరేదైనా ఉందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.



భుక్య అక్షిత్ (పాతచిత్రం)

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు మేరు/దర్జి కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి, వరంగల్ మేరు సంఘం సంయుక్త సహకారంతో ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



మట్టెవాడ, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి. నెట్ మేరు/దర్జి కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వరంగల్ ఎల్లంబజార్‌లోని శ్రీరామ మేరు సంఘం భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు శనివారం(సెప్టెంబరు 28), ఆదివారం(సెప్టెంబరు 29) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు వాట్సప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు. పూర్తి వివరాలకు 837444 5190, 800800 2165లో సంప్రదించవచ్చు.

3న ఎంఏ తెలుగు ప్రవేశ పరీక్ష

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం వరంగల్ ప్రాంగణంలో ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశాలకు అక్టోబరు 3న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పీఠాధిపతి ఆచార్య బి.బాబురావు శుక్రవారం తెలిపారు. దరఖాస్తు చేసిన వారు ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్లో wwwpstu-cet.org వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఉంటుందని, సకాలంలో హాజరు కావాలని అన్నారు.

శరన్నవరాత్రులకు రావాలని ముఖ్యమంత్రికి ఆహ్వానం



రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 13 వరకు జరిగే శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఈవో శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు ఆహ్వాన పత్రిక అందజేశారు. నవరాత్రి ఉత్సవాల గోడ పత్రికలు, బ్రోచర్లను శుక్రవారం ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి


జనగామ ఆర్టీసీ చౌరస్తాలో..


రఘునాథపల్లిలో


కొడకండ్లలో..

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమనేత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

– న్యూస్‌టుడే బృందం


పాలకుర్తిలో..


నర్మెట్టలో..


చిల్పూర్‌లో..


జఫర్‌గఢ్‌లో..


స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో కార్యాలయంలో..

వయోవృద్ధుల దినోత్సవ ర్యాలీ



జనగామటౌన్, న్యూస్‌టుడే: వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జనగామలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని జనగామ ఆర్డీవో కొమురయ్య ప్రారంభించారు. నెహ్రూ పార్కు నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఆర్డీవో మాట్లాడుతూ వయోవృద్ధులను కుటుంబ సభ్యులు ఆత్మీయంగా చూసుకోవాలన్నారు. పిల్లలను ఉన్నత స్థానాలకు చేర్చేందుకు అహర్నిశలు కృషి చేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ పార్థసారథి, డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్, జిల్లా సంక్షేమ అధికారిణి జయంతి, సీడీపీవో రమాదేవి, సఖి కేంద్రం నిర్వాహకురాలు రేణుక, వృద్ధాశ్రమాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

పాలకుర్తి, న్యూస్‌టుడే: సిద్ధార్థనగర్‌లోని మురుగుకాల్వల్లో మట్టి పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది.
- సోమేశ్వర్, పాలకుర్తి

పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయిస్తాం
- వెంకటేశ్వర్‌చారి, కార్యదర్శి, పాలకుర్తి

పరిసరాలు శుభ్రం

స్పందనకు వందనం

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: మండలంలోని సూరారంలోని పలు వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను 'న్యూస్‌టుడే' పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి శుభ్రం చేశారు.

అంకాపూర్‌కు రైతుల విజ్ఞాన యాత్ర


పసుపు పంటను పరిశీలిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యుదయ రైతులు, శాస్త్రవేత్తలు

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, నాబార్డు సౌజన్యంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఎంపిక చేసిన ఆదర్శ రైతులు విజ్ఞాన యాత్రకు వెళ్లారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌లో పసుపు, పప్పుధాన్యాలు, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. ఆధునిక పద్ధతుల్లో ఎత్తుబోదెలు, జంట పద్ధతిలో పసుపు సాగు, అంతర పంటలుగా పప్పుధాన్యాలు, గడ్డి నివారణ తదితర అంశాల గురించి శాస్త్రవేత్తలు వారికి వివరించారు. వానాకాలంలో పసుపు తరువాత మిరప సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయని వివరించారు. యాసంగిలో ఎర్రజొన్న సాగు మేలని సూచించారు. రైతు విజ్ఞానయాత్రలో వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా.రాములు, ఏఈవో సవిత, ఎంపిక చేసిన ఆదర్శరైతులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమించాలి


మహాసభలో పాల్గొన్న సంఘం నాయకులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ రంగ కార్మికుల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల ఐలయ్య పిలుపునిచ్చారు. స్థానిక వేడుకల మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఆ సంఘం మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకొని సంఘాన్ని బలోపేతం చేసినప్పుడే ప్రతి కార్మికుడికి రక్షణ కవచంగా సంఘం పనిచేస్తుందన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను టెండర్ ద్వారా బీమా కంపెనీలకు అప్పగించాలనే ప్రతిపాదనలను విరమించుకోవాలన్నారు. బోర్డు సలహాదారు కమిటీని నియమించి నిధులు దుర్వినియోగం కాకుండా కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేయాలని కోరారు. కార్యక్రమంలో అతిథులు సాయికుమార్, తాటికొండ మధు, జిల్లా అధ్యక్షుడు వాతాల యాదగిరి, ప్రధాన కార్యదర్శి కొమ్మగళ్ల కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాకృతుల ప్రదర్శన



ప్రదర్శనను పరిశీలిస్తున్న అధికారులు

జనగామ, న్యూస్‌టుడే: 'వ్యర్థాలతో అర్థం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జనగామలోని ధర్మకంచ జడ్పీ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. 60 పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన కళాకృతులను ప్రదర్శించారు. ఒక్కో బృందంలో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. జాతీయ హరిత దళం, ఎకో క్లబ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. నర్మెట్టలోని కేజీబీవీకి ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, దేవరుప్పులలోని జడ్పీఎస్‌ఎస్‌కు ద్వితీయ బహుమతిగా రూ.2వేలు, బచ్చన్నపేట కేజీబీవీకి తృతీయ బహుమతిగా రూ.1000, తరిగొప్పుల జడ్పీఎస్‌ఎస్‌కు నాలుగో బహుమతిగా రూ.500, చీటూరులోని జడ్పీఎస్‌ఎస్‌కు ప్రోత్సాహక బహుమతిగా రూ.500, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె.రాము, రాష్ట్ర ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, జిల్లా ప్రాజెక్టు అధికారి గౌసియా, హెచ్‌ఎం శ్రీనివాసరావు, సమన్వయకర్తలు అనీల్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న భాజపా

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను భాజపా ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ అన్నారు. మండలంలోని రంగరాయిగూడెంలో శుక్రవారం పార్టీ గ్రామసభ నిర్వహించారు. దేశంలోని ప్రజలందరికీ ఆర్థిక సమానత్వం రావాలంటే పోరాటలతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం గ్రామ పార్టీ కార్యదర్శిగా మునిగే నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు యాకయ్య, మంద ఇలిషన్, యాదగిరి, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇప్పగూడ రైల్వే స్టేషన్ యార్డులో శుక్రవారం చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 40 ఏళ్లు కలిగిన వ్యక్తి కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తుండగా గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి ట్రాక్ పక్కనే ఉన్న స్తంభానికి తాకి మృతి చెందారు. మృతుడి కుడి చేతిపై కాంతమ్మ, సోతియా అని పచ్చబొట్టు ఉన్నాయని, మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. వివరాలకు జనగామ జీఆర్పీ పోలీసులను ఆశ్రయించాలని వారు సూచించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..

దేవరుప్పుల రూరల్: వ్యవసాయ కూలి పనులు చేస్తున్న మహిళ హఠాత్తుగా మృతి చెందిన ఘటన దేవరుప్పుల మండలం కడవెండిలో శుక్రవారం చోటుచేసుకుంది. కడవెండికి చెందిన పెద్ది యాకాంత(49) వ్యవసాయ కూలీగా పని చేస్తోంది. పత్తి చేనులో పని చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. తోటి కూలీలు ఆమెను పరిశీలించి పాము కాటుగా అనుమానించారు. కానీ ఆమెలో ఆ లక్షణాలు కనిపించలేదు.

పాము కాటుతో రైతు..

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: పాము కాటుకు గురై మహిళా రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని శ్రీమన్నారాయణపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొంరెల్లి సారయ్య తమ మూడు ఎకరాల వ్యవసాయ భూమితో పాటు స్థానిక రైతుకు చెందిన భూమిని కౌలుకు తీసుకుని పత్తి, మిరుప పంట సాగు చేసున్నారు. సారయ్య భార్య అరుణ (28) పత్తి తీసేందుకు కూలీలతో కలిసి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లింది. ఆ సమయంలో పాము కాటు వేయడంతో వెంటనే జనగామ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.నరేశ్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: జనగామ సూర్యాపేట జాతీయ రహదారిపై శ్రీనివాసనగర్ కాలనీ వద్ద ద్విచక్రవాహనం, కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. జనగామ పట్టణానికి చెందిన కంకల రాజమల్లయ్య ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా జనగామ వైపు నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న కారు ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో రాజమల్లయ్య గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం జనగామ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఇసుక తరలిస్తున్న ఒకరిపై కేసు నమోదు

రఘునాథపల్లి న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన వ్యక్తి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రఘునాథపల్లికి చెందిన గండికోట రాజశేఖర్ ప్రభుత్వ అనుమతి లేకుండా నిడిగొండ వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్నాడు. రఘునాథపల్లికి వస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై డి.నరేశ్ తెలిపారు.

కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 29న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కులాంతర వివాహితుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు తూటి దేవదానం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శేఖర్ మాట్లాడారు. ఎక్కడా లేని విధంగా మన దేశంలో కుల వ్యవస్థ ఉండటం విచారకరమన్నారు. కుల దురహంకారంతో రోజు రోజుకూ హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 120 హత్యలు జరిగాయన్నారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించాలని రాజ్యాంగం చెబుతోందన్నారు. సమావేశంలో యాదగిరి, రమేష్, హతీయా సుల్తానా, స్వామి, మనోహర్, నరేష్, యాదక్క తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: వనపర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పడాల విష్ణుమూర్తిని మండల విద్యాధికారిగా (ఎఫ్‌ఏసీ) నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, శ్రీలత, యాదగిరి, నర్సింహులు, రవిశంకర్, లక్ష్మణ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, బకోజీ, యాదయ్య, ఎమ్మార్సీ సిబ్బంది సన్మానించారు.

ప్రైవేటు వసతిగృహాల్లో నిబంధనలు పాటించాలి


వసతిగృహంలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్, ఎస్సై రాజేష్

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన వసతిగృహాల్లో నిబంధనలు పాటించాలని జిల్లా వైద్యాధికారి రవీందర్ గౌడ్ సూచించారు. జనగామలోని ఏబీవీ జూనియర్ కళాశాల వసతిగృహంలో గురువారం రాత్రి అస్వస్థతకు గురైన విద్యార్థులు జిల్లా జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్ శుక్రవారం ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శించారు. కళాశాలకు చెందిన వసతిగృహాన్ని డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్, ఎస్సై రాజేష్, వైద్య సిబ్బంది తనిఖీ చేశారు. వసతిగృహం ఆవరణలో పిచ్చి మొక్కలు పెరగడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో వసతులను సమకూర్చకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అర్బన్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


చిన్నమడూరులో మాట్లాడుతున్న డీఈవో రాము

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని డీఈవో రాము అన్నారు. చిన్నమడూరులో శుక్రవారం ఎస్‌జీఎఫ్‌ఐ మండల స్థాయి క్రీడా పోటీలను డీఈవో ప్రారంభించారు. డీఈవోను ఉపాధ్యాయులు సన్మానించారు. మండల విద్యాధికారి కళావతి, ఎస్‌వో రమేష్, పీడీలు ప్రవీణ్ కుమార్, కిరణ్, యాదగిరి, రవి, ప్రణీత, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్: నిబద్ధతతో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి రాము అన్నారు. గానుగుపహాడ్‌లోని ఎంపీపీఎస్‌లో పని చేసిన ప్రధానోపాధ్యాయుడు రాజా రవీందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఎంపికపై నేడు అభ్యంతరాల స్వీకరణ

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల నిజ ధ్రువపత్రాలను శనివారం అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) కార్యాలయంలో పరిశీలించి తర్వాత నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు జిల్లా వైద్యాధికారి రవీందర్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. ఉద్యోగుల ఎంపికపై అభ్యర్థులకు సందేహాలుంటే శనివారం మధ్యాహ్నం 2 గంటల్లోగా అభ్యంతరాలు అందజేయాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల సందర్శన


కొడకండ్లలో..

కొడకండ్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో నిర్లక్ష్యం తగదని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. ఆయన శుక్రవారం చెరువుముందు తండాలో అమ్మఆదర్శ పాఠశాల పనులు, కడగుట్టతండాలో మన ఊరు-మన బడి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల నిలయం.. అగ్నిమాపక కేంద్రం


శివునిపల్లి విశ్రాంతి భవనంలో కొనసాగుతున్న అగ్నిమాపక కేంద్రం

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం సమస్యల విలయంలో కొట్టుమిట్టాడుతోంది. గతేడాది మండలంలోని శివునిపల్లిలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అగ్నిమాపక కేంద్రంలో మొత్తం పది మంది సిబ్బందికి ఆరుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. పాత కాలం నాటి భవనంలో కావడంతో వర్షాకాలం ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం 20 ఏళ్ల కిందటి పాత వాహనం కేటాయించడంతో అది వేగంగా నడవని పరిస్థితి. దింతో భారీ అగ్ని ప్రమాదాల సమయంలో జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. వాహనానికి షెడ్డు లేకపోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తుంది. నూతన భవనం ఏర్పాటుకు అధికారులు మండలంలోని నమిలిగొండ గ్రామ పరిధిలో ఘన్‌పూర్-జఫర్‌గఢ్ రోడ్డు పక్కన 30 గుంటల స్థలాన్ని కేటాయించిన ఇప్పటి వరకు భవన నిర్మాణానికి అడుగులు పడడం లేదు. దీంతో విశ్రాంత భవనంలో ఇబ్బందుల మధ్య సిబ్బంది కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకొని నూతన భవనం మంజూరుతో పాటు, నూతన వాహనం కేటాయించి సమస్య పరిష్కరించాలని అగ్నిమాపక సిబ్బంది కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

- ఎన్. దేవేందర్, స్టేషన్‌ఘన్‌పూర్ అగ్నిమాక అధికారి

అగ్నిమాపక కేంద్రంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. నూతన భవనంతో పాటుగా కొత్త వాహనం మంజూరయ్యేలా చూస్తాం. సిబ్బంది సైతం పూర్తిస్థాయిలో ఉండే విధంగా అధికారులకు నివేదిక అందిస్తామని వివరించారు.

సంక్షిప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

తరిగొప్పుల, న్యూస్‌టుడే: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలు కల్పించాలని ఆర్డీవో కొంరయ్య అన్నారు. ఆయన శుక్రవారం తరిగొప్పులలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, ర్యాంపులు, మూడు చక్రాల సైకిళ్లు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలని, మరణించిన వారి పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగింపు, ఓటరు జాబితాల్లో తప్పుల సవరణ పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు నాగేశ్వరచారి, ఆర్ఐ రవీందర్, బీఎల్‌వోలు సంతోష, శారద పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి సస్పెన్షన్

జనగామ: కాంగ్రెస్ పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న నాయకుడు వేముల మల్లేశ్‌ను సస్పెండ్ చేసినట్లు పార్టీ పట్టణాధ్యక్షుడు బుచ్చిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను డీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్నానని, తనపై చర్య తీసుకునే అధికారం పట్టణాధ్యక్షుడికి లేదని వేముల మల్లేశం పేర్కొన్నారు.

పోలీసుస్టేషన్ తనిఖీ

తరిగొప్పుల: పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని నర్మెట్ట సీఐ అబ్బయ్య అన్నారు. ఆయన శుక్రవారం తరిగొప్పుల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై శ్వేత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'శంకరమంచియం' పుస్తకావిష్కరణ


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎంఈవో నర్సయ్య

పాలకుర్తి: ప్రముఖ సాహితీవేత్త శ్యాంప్రసాద్ రచించిన 'శంకరమంచియం' పుస్తకాన్ని శుక్రవారం పాలకుర్తి ఉన్నతపాఠశాలలో ఆవిష్కరించారు. మండల ఇన్‌ఛార్జి ఎంఈవో పోతుగంటి నర్సయ్య, ఉపాధ్యాయులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థి దశనుంచే సాహిత్యం, తెలుగు భాషపై అభిరుచి కలిగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శోభారాణి, సోమేశ్వరరావు, ఓరుగంటి రమేశ్, నరసింహమూర్తి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



బచ్చన్నపేటలో మాట్లాడుతున్న ఎస్సై సతీశ్

బచ్చన్నపేట: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎస్సై సతీశ్ అన్నారు. బచ్చన్నపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఎంఈవో ఇర్రి వెంకట్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు


కౌన్సిలర్ సమద్‌ను సన్మానిస్తున్న మైనార్టీ ఉద్యోగులు

జనగామ టౌన్: ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు ఉత్తమ సేవలందిస్తే గుర్తింపు ఉంటుందని తెలంగాణ మైనార్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంకుషావలి అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిలర్ సమద్, ఉపాధ్యాయులు మిజ్జహిద్ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తహసీసన్, జలీల్, మతీన్, అక్బర్ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

మిట్ట కాల్వ పునరుద్ధరణకు చర్యలు

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: జఫర్‌గఢ్ పెద్ద చెరువు మిట్ట కాల్వ శిథిలావస్థకు చేరడంతో పంట పొలాలకు సాగునీరు అందక రైతులు కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఇటీవల ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి రైతులు తీసుకెళ్లారు. తూము ద్వారా నీరు వృథాగా పోతుందని ఎమ్మెల్యేకు వివరించారు. నీటిపారుదల శాఖ డీఈ శేషగిరి, ఏఈ కృష్ణారెడ్డి కాల్వలను పరిశీలన చేశారు. మిట్ట కాల్వ కింద 300 ఎకరాలు సాగు అవుతుంది. ఎమ్మెల్యే స్పందించి ఐబీ అధికారులు కాల్వను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేయడంతో వారు సందర్శించారు. మరమ్మతులకు ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామని ఏఈ కృష్ణారెడ్డి తెలిపారు.

ఎంఈవోకు సన్మానం

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: జఫర్‌గఢ్ మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన పర్వేజ్‌ను శుక్రవారం ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య సభ్యులు అభినందించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్, జిల్లా కోశాధికారి తాడూరి సుధాకర్, జిల్లా కార్యదర్శి కందుల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి భానుప్రకాశ్, పిట్టల మహేందర్, శ్రీనివాస్, వంశీకృష్ణ తదితరులు సన్మానించారు. ప్రభుత్వ బడులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఉపాధ్యాయులు తోడ్పాడు అందించాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాధికారి (ఎంఈవో) పర్వేజ్ అన్నారు. 68వ మండల స్థాయి క్రీడోత్సవాలను మండలంలోని కూనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభించారు. ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తి చూపి ఉన్నతంగా ఎదిగి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. క్రమశిక్షణ అలవార్చుకోవాలని తెలిపారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీ సాయికుమార్, ఉపాధ్యాయులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కోమాళ్లలో అమనుగంటి కృష్ణ ఇటీవల మృతి చెందాడు. అతనితో 2001-02 లో పదో తరగతి చదివిన స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.31 వేలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పెంట సుమన్, ఒరెగెల రాజు, ఎలిశాల సురేశ్, బొల్లపల్లి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పరిశీలన


నాయకులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యుడు బీర్ల ఐలయ్య

లింగాల ఘనపురం, న్యూస్‌టుడే: నవాబుపేట రిజర్వాయర్‌ను, రిజర్వాయర్ నుంచి ఆలేరు నియోజకవర్గంలోని గుండాల మండలానికి నీరు సరఫరా చేసే కాలువలను ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నియోజకవర్గ నాయకులతో కలిసి శుక్రవారం సందర్శించారు. రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటి మట్టం, నీటి సరఫరాకు కావాల్సిన నీటిమట్టం, కాలువల పరిస్థితిని పరిశీలించారు. ఆయకట్టు, కాలువల మ్యాప్ పరిశీలించారు. ఈఈ ప్రవీణ్, ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ తూము గేటు ఎత్తి నీరు విడుదల చేసి గుండాల మండలంలోని చెరువులు నింపి సస్యశ్యామలం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.